# చిగురు వేసిన ఆశ

ఆయనకేం, దశరథ మహారాజు... రేపు కొడుకులు రెండు చేతులా సంపాదించి ఒళ్లో పోస్తారు...'

బంధుమిత్రులు అలా అన్నప్పుడల్లా నాగభూషణం నిజమనే అనుకున్నాడు. కొండంత సంతోషం చెందేవాడు. పొరపాటున అపశ్రుతి వినిపిస్తే, కుప్పలా కూలిపోయేవాడు. అసూయ కొద్దీ అంటున్నారని వాళ్లని లోలోపల తిట్టుకునేవాడు.

'నా సంతానం రత్నాలు కదూ! ఉత్తపుణ్యానికి వాళ్లని సందేహించడం, మహాపచారం. వాళ్ల వల్ల నాకెన్నడూ అన్యాయం జరగదు' అనుకుని నాగభూషణం కొత్త ఉత్సాహం తెచ్చుకొనేవాడు. ఏ తండ్రికీ లేనంత అభిమానం తనకు తన కొడుకుల మీద వుందని మహా గర్వపడేవాడు. వాళ్లూ తండ్రి పట్ల అంత విధేయంగా ఆప్యాయంగా మెలిగేవారు. అలాంటి పుత్రరత్నాలను పల్లెత్తుమాట అన్నా ఎవరు మాత్రం సహిస్తారు!

ఒకరోజు సాయంకాలం తుపాను దెబ్బ తిన్న వానిలా కుప్పల్లా కూలిపోయి కనిపించాడు నాగభూషణం. గాంభీర్యానికి బదులు ముఖంలో విషాదం గూడు కట్టుకుంది. అందుకు తోడు బవిరిగడ్డం. అరవైయేళ్లవాడు వయస్సు మరీ పై బడ్డవాడుగా తయారయ్యాడు.

వీధి దీపాలు వెలిగాయి. ఇంట్లోనూ. కాని అంతరంగంలో ప్రశ్నార్థకమే!

ఆ రోజు ఉదయం వీధి తిన్నె మీద కూర్చుని నాగభూషణం పత్రిక చదువుతున్నాడు. ధుమ ధుమ లాడుతూ పెద్ద కొడుకు యింట్లోకి వెళ్లడం కూడా గమనించలేదు. వెళ్లిన కొంత సేపటికల్లి అతను బాణంలా దూసుకువచ్చాడు.

'నాన్నా...'

పిడుగు పడ్డట్టుగా భావించాడు నాగభూషణం. చదువుతున్న పత్రికను కింద పెడుతుంటే, 'రేపట్నుంచీ నేను నా భార్య విడిగా వుండదలచుకున్నాం' అన్నాడు కొడుకు.

తండ్రి నిర్ఘాంతపోయాడు. ముద్దకట్టుకున్న పుత్రవాత్సల్యంలో బీట సన్నగా కనిపించింది.

'ఉన్నట్టుండి ఎందుకురా అలా అనుకున్నావ్...'

'ఈ యింట్లో మాకు గౌరవం లేదు. పురుగుల్లా అంతా మమ్మల్ని చూస్తున్నారు. విడిగా వుండడం మంచిదనిపించింది. అందుకే యీ నిర్ణయానికి వచ్చాం' ఆగిపోయాడు.

'నువ్వు చెప్పదలచిందంతా చెప్పడం పూర్తయిందా?..'

'చెప్పదలచుకుంటే ఒకరోజు చాలదు..'

'అన్ని విషయాలున్నాయా?'

'ఒకటా...రెండా...వేలు...'

'వీధిలో ఎందుకండీ అలా మాట్లాడుకోవడం... లంకంత కొంప వుంది గదా...'

ఏ ఉద్దేశంతో కోడలు తలుపు చాటున నిలబడి చెప్పిందో కాని, ఆమె మాటలు మామగారికి దివ్యౌషధంలా కనిపించాయి.

'అవునవును... అంటూ నాగభూషణం లేచాడు.

'రచ్చకెక్కడమే మంచిదనిపిస్తోంది. ముసుగులో గుద్దులాట ఎందుకు...'

'అభిమానం లోపించింతర్వాత...'

'ఎవరికి లోపించిందంటావ్? నీకా, నాకా?' కొడుకు మాట మండుటెండలా చుర్రుమంది.

'నీకేం తక్కువ చేశానని...'

మండుటెండకి కరిగిపోయిన మంచులా కనిపించింది తండ్రి మాట.

'మిగిలిన ముగ్గురికీ చదువులు చెప్పించావు...?

'అప్పట్లో నా పరిస్థితి అంతంత మాత్రంగా వున్న విషయం నీకు తెలియకపోవచ్చు. కమ్మని తిండికి కూడా నోచుకోని రోజులవి...?

'పరిస్థితులు బాగాలేవని తప్పించుకుంటే మాత్రం నాకు జరిగిన అన్యాయం మరుగున పడిపోతుందా?...'

'అన్యాయమా!'

'ముమ్మాటికీ,నాది వానాకాలపు చదువు కాబట్టే, తమ్ముళ్ల మాదిరి ఏ ఢిల్లీకో, బొంబాయికో వెళ్లలేకపోయాను. ఇంటి పట్టున వుండవలసి వచ్చింది. .. పెద్ద ఉద్యోగాలు చేయలేకపోతున్నాను...'

మాటకు మాట పెరగడమే తప్ప అసలు సమస్య పరిష్కారం కాదను కొని నాగభూషణం మౌనం వహించాడు. కాని ఆయనలో అంతర్మథనం ప్రారంభమయింది.

'ఇప్పుడాపాత విషయాలన్నీ తవ్వుకుని, మామంగారిని బాధపెడుతున్నారెందుకు...?'

మామగారి పక్షం వహిస్తున్నట్లుగా మాట్లాడింది కోడలు.

'నేను పడుతున్న బాధ మీ కందరికీ ఎలా తెలుస్తుంది? లోలోపల నేను దహించుకుపోతున్నాను...' అతను రెచ్చిపోయాడు.

'నీకు పై చదువులు చెప్పించని మాట నిజమే...'

'ఈ ఒక్క అన్యాయం చాలదూ... గానుగెద్దులా ఉన్నచోటనే పడివుండాల్సి వచ్చింది...'

'చచ్చిన పామునే యింకా చంపుతావెందుకురా?'

'తమ్ముళ్ల మాదిరి నేను హాయిగా జీవితం సాగించలేకపోతున్నాను. గొర్రె తోక జీతం రాళ్లూ నేనూ...'

'అదే నేను నీకు చేసిన అన్యాయమంటావ్...అంతేగా'

'నీకు తెలును. తెలిసీ నా నోట చెప్పిస్తున్నావ్.'

'అయితే యిప్పుడేం చెయ్యమంటావు?' నాగభూషణం మాటలో అసహనం తొంగి చూసింది.

'నా వాటా నాకు పంచేస్తే నేను నా దారి చూసుకుంటాను.'

కుండ బ్రద్దలు కొట్టినంత స్పష్టంగా పెద్ద కొడుకు చెప్పేసరికి, నాగభూషణానికి అంతా శూన్యంగా కనిపించింది.

'అదేం మాటండీ... మీ దారి మీరు చూసుకుంటే, మామగారిని ఎవరు చూస్తారు?' అంది కోడలు, ఏమీ తెలియనిదానిలా.

'బొంబాయిలోను, ఢిల్లీలోను వున్నారుగా కొడుకులు. నేనొక్కణ్ణే కాదుగదా కొడుకుని! తండ్రిని చూసే బాధ్యత వాళ్లకూ వుంది...'

అసలు రహస్యం తెలుసుకున్నవాడిలా నాగభూషణం కనిపించాడు. లేని సంతోషం తెచ్చుకున్నాడు. నవ్వడానికి ప్రయత్నిస్తూ వుంటే కోడలు ఒక్కొక్క మాట నొక్కి నొక్కి చెప్పింది.

'ఇంత కాలం మనవద్ద వున్న మామగారిని, యిప్పుడు మరో చోటికి వెళ్లమంటే ఆయన బాధపడరూ...'

'నా బాధకేంగాని, అబ్బాయి చెప్పినట్టుగా మీరు విడిగానే వుండండి. అప్పుడైనా మీరు హాయిగా వుండొచ్చు...' అన్నాడు నాగభూషణం.

'మీరలా అంటారని నేను కల్లో కూడా అనుకోలేదు' లోపల సంతోషిస్తూనే, పైకి అలా అంది కోడలు. ఆమె మాటలు మామగారికి వినిపించినట్టు లేదు.

'రేపే నీ తమ్ముళ్లకి ఉత్తరాలు రాస్తాను. వచ్చి వాటాలు వేసుకోండని చెపుతాను... అది సరే... నా ఒక్కడికీ యింత పెద్ద యిల్లెందుకు?...' నాగభూషణం మాట పూర్తికాలేదు.

'అవును. ఈ యిల్లు కూడా వాటాలు వెయ్యండి. ఇష్టమైతే అట్టిపెట్టుకుంటాము. లేకపోతే అమ్మేస్తాము' అన్నాడు ఠపీమని కొడుకు.

నాగభూషణం కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి.

అది గమనించింది కోడలు.

'చిన్న మరిదిగారి విషయం ఏం చేస్తారు?'

వినిపించీ వినిపించనట్లుగా అడిగింది.

'ఎప్పుడో యింటి నుంచి పారిపోయిన ఆ వెధవ ఏ గంగలో కలిశాడో.'

నాగభూషణం తోక తొక్కిన తాచు అయ్యాడు.

'వాడేరా... నీ ఆఖరి తమ్ముడు... వాణ్ణి గురించి నేను తలచుకోని రోజు లేదు.

ఎన్నటికైనా తిరిగొస్తాడని యింతకాలం ఆశ పెట్టుకున్నాను. నా ఆస్తిలో వాడికీ భాగం వుంది...'

'ఆ భాగం ఎవరికిస్తారు?' అడిగాడు కొడుకు వెటకారంగా, తండ్రి గ్రహించాడు.

'ఇప్పుడు మీ కందరికీ ఎందుకిస్తున్నాను నా ఆస్తిని?'

'మేము కొడుకులం కనుక.'

'అలాగే ఇంట్లోంచి పారిపోయిన ఆ కొడుక్కీ యిస్తాను...'

'అదే ఎవరికిస్తారని?'

కన్నకొడుకు యింత మొండిగా పట్టువిడుపులు లేకుండా వ్యవహరిస్తాడని ఎన్నడూ తలవని ఆ తండ్రి మొదలు విరిగిన చెట్టుని తలపించాడు. తన నడివయస్సులోనే కాలధర్మం చెందిన యిల్లాలు గుర్తుకి వచ్చింది. హృదయం పైకి పొక్కని శోకంతో నిండి పోయింది. ఆ శోకంలో రకరకాల వూహలు ఉవ్వెత్తున లేచి అణగారి పోయాయి.

నాగభూషణం ఒక జడపదార్థంగా క్షణాల మీద మారిపోయాడు. అనురాగం, అభిమానం వంటి మాటలు అర్థరహితాలుగా తోచాయి. ద్వేషం లాంటి భావం ఆక్ర మించింది.

'ఎవరికిస్తారని అడిగావు కదూ...'

తండ్రి వాలకం చూస్తున్నకొద్దీ కొడుకులోని మొండితనం సనసన్నగా తప్పుకోసాగింది.

కోడలైతే దిగ్భ్రాంతి చెందింది.

'దారిన పోయ్యే దానయ్యకిస్తా... తెలిసిందా...' అంటూ అదోలా నవ్వాడు.

పిచ్చనవ్వుగా తోచింది కొడుక్కి.

2 అయోమయావస్థలో పడింది కోడలు.

'నేను స్వార్థపరుణ్ణి. కొడుకులేదో తవ్వి తలకెత్తుతారని అనుకున్నాను. పారిపోయి ఏ గంగలోనో కలిసిపోయిన ఆ కొడుకూ నాకు అక్కరకు రాలేదు. పారిపోకుండా ఎవరి యిళ్లల్లో వాళ్లు వుంటున్న మీరు అక్కరకు రాలేదు...'

తండ్రీ కొడుకుల మాటలు, కొంతవరకు విన్న పక్కింటి గురుమూర్తి 'ఇవ్వాళ్ల మా దశరథమహారాజు ఏదో విషాదయోగంలో పడ్డట్టున్నాడే...' అంటూ దగ్గరికి రాకపోతే, నాగభూషణం మనస్సు గండిపడ్డ చెరువయ్యేది.

'పుత్రశోకంతో ఆ రాజు 'హరీ' అన్నాడు. కొడుకుల కారణంగా ఈ వెంగళప్ప 'హరీ' అనే స్థితి ఎప్పుడొస్తుందా అని ఎదురు తెన్నులు చూస్తున్నాడు...'

'భూషణం, ఎందుకయ్యా యీ వెర్రివేదాంతం! నాన్నా అంటూ కొడుకులు దగ్గరికి వస్తే కౌగిలించుకోవూ...' జీవితసారాన్ని గురుమూర్తి తెలియజేశాడు. మిత్రుణ్ణి లోపలికి తీసుకువెళ్లాడు. తండ్రి వెంట కొడుకూ వెళ్లాడు.

మూడు నాలుగు నిమిషాలు మౌనం ప్రభుత చేసింది. ఆ మౌనాన్ని ఛేదిస్తూ గురుమూర్తి మాటల్లోకి దిగాడు.

'చూడు భూషణం, కలిసివుంటే మంచిదే. అలా కానప్పుడు వేరు తప్పదు. గాలి వీచినా ఎండవేసినా, వానకురిసినా, మొక్క పువ్వుని గట్టిగా పట్టుకునే వుంటుంది. కాని కొన్నాళ్లకవి వేరువేరవుతున్నాయి. ఇది ప్రకృతి ధర్మమనుకో. అలా అనుకుని బతికినప్పుడే మనకు చీకు చింతలుండవు. వయసు వచ్చే కొద్దీ చీకు చింతల్ని దూరం చేసుకోవడానికి ప్రయత్నించాలి...'

ఆ తర్వాత ఏవో అవీ యివీ మాట్లాడి గురుమూర్తి వెళ్లిపోయాడు.

కాలం మామూలుగానే గడిచిపోతున్నా,నాగభూషణం విరక్త చిత్తునిలా కనిపించాడు. మనోవీధి నిర్మలాకాశం కాలేదు.

సాయంకాల మయింది. వీధి తిన్నె చేరుకున్నాడు. ఉభయ సంధ్యలలోనూ తిన్నె మీద కూర్చుని పత్రిక చదవడమో లేకపోతే వచ్చే

పోయేవారిని చూడడమే నాగభూషణం దైనందిన చర్య. కాని ఆ సాయంకాలం ఆ రెండూ చెయ్యలేకపోయాడు. అసలు మనస్సు మనస్సులో లేదు. వంచిన తల పైకెత్తలేదు.

'నాన్నా...' నాగభూషణంలో కదలికలేదు.

ఈ సారి 'నాన్నా' అని కొంచెం బిగ్గరగానే వినవచ్చింది. భూమిలోని విత్తనం నేలను చీల్చుకుంటూ తల ఎత్తేలా, కుసుమం విచ్చుకునేలా నాగభూషణం ఎత్తలేక ఎత్తలేక తల ఎత్తసాగాడు.

'నేను నాన్నా...'

ఆ.... ఆ.... అంటూ ఒళ్లంతా కళ్లు చేసుకుని చూశాడు. నాగభూషణం. ఇంటి నుంచి ఎప్పుడో పారిపోయిన కొడుకు... ఆఖరి కొడుకు... తనను ఉద్ధరిస్తాడనుకుని ఆశలు పెట్టుకున్న ముద్దుల కొడుకు... అమాంతం కౌగిలించుకున్నాడు...

అప్పుడే వాకిట్లోకి వచ్చిన నాగభూషణం కోడలు బిగ్గరగా అంది 'వచ్చాడండీ... మీ ఆఖరి తమ్ముడు...'

తమ్ముణ్ణి తేరిపార చూస్తున్నాడు అన్నయ్య.

'చూడు... బాగా చూడు... ఏ గంగలోను కలవలేదు...' అంటున్నాడు నాగభూషణం, సంతోషం పట్టలేక.

'అయితే మా భూషణం మళ్లీ దశరథ మహారాజయ్యాడన్నమాట!' గురుమూర్తికి ఎక్కడలేని సంతోషం కలగింది.

'ఆ మహారాజుకి కలగని అదృష్టం ఈ వెంగళప్పకి కలిగిందయ్యా.. మళ్లీ ఆశలు చిగుళ్లు వేస్తున్నాయి...'

'శుభం...'

ఇంట్లో ఎటు చూసినా వెలుగు వెల్లువే...